

ప..రేషన్!

కొత్త రేషన్‌కార్డులకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రక్రియ ఆరంభిస్తుందా.. ఎప్పుడు దరఖాస్తు చేసుకుందామా అని నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంకా ప్రక్రియ ప్రారంభించ కపోవడంతో నిరాశ చెందారు. తొలుత సంక్రాంతికి కొత్త కార్డులు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త కార్డులు జారీ చేస్తే ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. మంత్రి నాదెండ్ల మేలో కొత్త కార్డులు జారీ చేస్తామని చెప్పడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

నాలుగేళ్లుగా రేషన్‌కార్డులకు తప్పని నిరీక్షణ

- వైసీపీలో మూడేళ్లూ ఆ ఊసేలేదు
- ప్రస్తుత ప్రభుత్వంలోనూ జాప్యం
- అర్హులైన పేదల ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో కార్డులకు క్యూ
- మే నెలలో ఇచ్చేందుకు ప్రణాళిక
- ఇప్పటికే 16.20 లక్షలు
- మరో 3 లక్షల దరఖాస్తులు
- తాజాగా కార్డులకు ఈకేవైసీ
- నెలాఖరు వరకూ గడువు పెంపు

సామర్లకోట, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు కావడం లేదు. నాడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి రెండేళ్ల రేషన్‌కార్డుల పేరిట బియ్యం కార్డులు మంజూరు చేసింది. తర్వాత మూడేళ్లలో ఒక్క కార్డూ ఇవ్వలేదు. వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్న చాలామంది అర్హులకు కార్డులు రాలేదు. ఆ పార్టీ మద్దతుదారులకు అధికంగా కార్డులు జారీ చేశారన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగానే అర్హులు అందరికీ కొత్త కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. మొన్న సంక్రాంతికి కార్డులు ఇస్తామని పేర్కొంది. జిల్లా పౌరసరఫరాల అధికారులు కొత్తకార్డులు ఇస్తామని గత డిసెంబరులో ప్రకటించారు. డిసెంబరు 2వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపడతామని, కొత్త రేషన్‌కార్డులే కాదు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కానీ ఆ తర్వాత అది పురోగతి లేకుండా పోయింది.

ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం

ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులనే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో కొత్తకార్డులు కావాలని కోరుతూ జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు సమర్పిస్తున్నారు. మూడేళ్లుగా రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇప్పుడు అనేక మంది అటు తహశీల్దార్ కార్యాలయాలు, ఇటు పౌరసరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఎవరో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిగా ఉన్నవారు కొత్తకార్డుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్ కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీలు విషయాన్ని జిల్లా అధికారులు ప్రస్తావించారు.

బోగస్ ఏరివేతకే.. ఈకేవైసీ

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 6,43,874 కార్డులు, కోనసీమ అంబేడ్కర్ జిల్లాలో 5,37,902 కార్డులు, తూర్పు గోదావరి జిల్లాలో 5,64,994 కార్డులు ఉన్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్తరేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఇప్పటికే నమోదు చేసుకున్న దరఖాస్తుల గణాంక సమాచారం ద్వారా తెలుస్తోంది. రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించనుంది. అందుకు ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులకు ఈకేవైసీని చేపట్టింది. దీనివల్ల రేషన్‌లో అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. సాధారణంగా కార్డు కలిగిన కుటుంబంలో ఒకరు వేలిముద్ర వేసి ప్రతినెలా రేషన్ తీసుకుంటున్నారు. మిగిలిన సభ్యుల్లో కొందరు చదువులు, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటుండడంతో అటువంటి వారి వేలి ముద్రలు అప్‌డేట్ కాలేదు. దీంతో ప్రస్తుతం తెల్లరేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని అలాంటి సభ్యులందరితో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించేలా చర్యలు తీసుకున్నారు. నెలల తరబడి ఈ-పోస్‌లో వేలిముద్రలు వేయని వారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. అధిక శాతం ఈకేవైసీకి నోచుకోకపోవడంతో ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకూ పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.



మే నెల నుంచి కొత్తకార్డులు?

ఏటీఎం తరహాలో.. మంత్రి ప్రకటన..

ప్రస్తుతం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ గతంలోనే పూర్తయింది. 800కు మించి కార్డులున్న రేషన్ షాపులను అధికారులు గుర్తించారు. కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు కార్డుల విభజన ప్రక్రియ చేశారు. గ్రామాల్లో ఒక్కొక్క చౌక దుకాణానికి 400 నుంచి 450 కార్డులు ఉండాలని, మునిసిపాలిటీల పరిధిలో 500 నుంచి 550 కార్డులు ఉండాలని, కార్పొరేషన్ పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలని అధికారులు నిర్ణయించారు. కానీ దీనిపై డీలర్లు కోర్టును ఆశ్రయించి తమకు ఒక్కొక్కరికి 1000 రేషన్‌కార్డులు ఉంటేనే జీవనం సాగించగలమని తెలిపారు. దీంతో కొత్త కార్డుల జారీకి బ్రేక్ పడింది. కోర్టు వ్యవహారం ఇటీవల ముగిసింది. చనిపోయిన వారి కార్డులు తొలగించిన తర్వాత కార్డుల విభజన చేపట్టాలని న్యాయ స్థానం సూచించినట్టు సమాచారం. ఈ క్రమంలో ఈకేవైసీ పూర్తయిన వెంటనే కొత్త కార్డుల జారీ మొదలుకానుందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుత రేషన్‌కార్డు సైజు తగ్గించి ఏటీఎం కార్డు తరహాలో మే నెల నుంచి ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆ సమయంలోనే కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని, క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డులు ఇస్తామన్నారు. అయితే కొత్త కార్డులు ఈసారైనా ఇస్తారో లేదో చూడాలి.

వేసవి కార్యాచరణ

పటిష్టంగా అమలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండ్యన్, కలెక్టర్ షాన్‌మోహన్

- రానున్న మూడునెలల్లో ముమ్మరంగా ఇంజినీరింగ్ పనులు
- జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండ్యన్
- కలెక్టర్, వివిధశాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): వర్షాలు ప్రారంభమయ్యేలోపు రానున్న మూడునెలల్లో జిల్లాలో చేపట్టిన ఇంజనీరింగ్ పనులను ముమ్మరంగా నిర్వహించాలని, పటిష్ఠమైన వేసవి కార్యాచరణ అమలు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ అధికారులను కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, వివిధశాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల జిల్లా కలెక్టర్లతో సీఎం నిర్వహించిన సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించి తాను ప్రెజెంటేషన్ ద్వారా శాఖలవారీగా సమర్పించిన అంశాలను కలెక్టర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండ్యన్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకొకసారి జిల్లా ప్రగతిని ముఖ్యమంత్రి సమీక్షించనున్నందున, వార్షిక లక్ష్యాన్ని త్రైమాసికాలవారీగా లక్ష్యాలుగా విభజించుకుని ప్రణాళికాబద్ధంగా వాటిని పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా వివిధ ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన నిర్మాణ, నిర్వహణ పనులను వానాకాలం మొదలయ్యేలోపు సాధ్యమైనంత ఎక్కువగా చేపట్టాలన్నారు. రానున్న 3నెలల్లో పెద్దసంఖ్యలో ఉపాధి హామీ పనులు చేపట్టి, కూలీలకు పనులు, వేతనాలు కల్పించాలన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని పనులను ఉదయం 11 గంటలలోపు, మధ్యాహ్నం 4గంటల తర్వాత మాత్రమే చేయించాలన్నారు. రానున్న వేసవి మాసాల్లో ప్రజలకు తాగునీటి సరఫరా అత్యంతప్రాధాన్య అంశంగా మున్సిపల్ కమిషన్లు, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపట్టాలన్నారు. నీటి వనరుల స్నిటీసీ క్లీనింగ్‌చేయించాలన్నారు. వేసవి వడగాల్పులవల్ల వచ్చే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వైద్యఆరోగ్యశాఖ సమాయత్తం కావాలన్నారు. వడదెబ్బ బాధితుల వైద్యం కోసం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో 4నుంచి 6పడకలతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో 10వేలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. దాతల సహకారంతో జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి చల్లని నీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు కాలువలు, చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలకు లోనుకాకుండా చూడాలన్నారు. పశువులకు తొట్టెల్లో నీటిని నింపాలన్నారు. రబీపంటల కోతలను పూర్తి చేసి వేసవి అపరాల పంటలు, తదుపరి ఖరీఫ్ పంటలసాగు సకాలంలో చేపట్టాలని రైతులకు సూచనలు జారీ చేయాలన్నారు. జేసీ రాహుల్‌మీనా, కాకినాడ కమిషనర్ భావన, డీఆర్వో వెంకట్రావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఈవో రమేష్, డీఎంహెచ్‌వో నరసింహనాయక్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పారదర్శకతకే ఐవీఆర్ఎస్ కాల్స్

- జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్
- సామర్లకోట మండలం మాధవపట్నంలో సామాజిక పింఛన్ల పంపిణీ
- హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీలో పారదర్శకత కోసమే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా క్షేత్రస్థాయి లబ్ధిదారుల నుంచి స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం తెలుసుకుంటోందని జిల్లా ఇన్‌చార్జి అధికారి, సీనియర్ ఐఏఎస్ అధికారి జి.వీరపాండ్యన్ అన్నారు. సామర్లకోట మండలం మాధవపట్నం జమునా కాలనీలో ఏప్రిల్ నెల మొదటిరోజు వృద్ధాప్య, వితంతు, ఇతర పింఛన్ల పంపిణీలో మంగళవారం ఆయన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడాచైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌లతో కలిసి పాల్గొన్నారు. జమునానగర్‌లో లబ్ధిదారులకు నేరుగా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి వీరపాండ్యన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఏమైనా సమస్యలు ఉంటే సరిచేసేందుకే జిల్లాలకు ప్రత్యేక ఇన్‌చార్జి అధికారులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. పంపిణీ తీరుపై లబ్ధిదారులకు ఈనెల నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా సమస్యలను నేరుగా తెలియజేయవచ్చన్నారు. జమునానగర్‌లో తోలుబొమ్మలాట కళాకారులు పింఛన్ లబ్ధిదారులు షేక్



సామర్లకోట మండలం మాధవపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్, చిత్రంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కలెక్టర్ షాన్‌మోహన్

హసిని, మున్నీసా, మోటూరి కాటమ్మ, చప్పిడి రాఘవ గృహాలకు నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లి పింఛన్ సొమ్ములు అందజేశారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో సిబ్బంది ఏ నిర్లక్ష్యం వహించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవి చేపట్టిన పదినెలల్లోనే పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులు రూ.50కోట్లతో వివిధ రకాల పనులు చేపట్టామన్నారు. కాండ్రకోటలోని బ్రిడ్జి నిర్మాణానికి మొత్తం రూ.కోటి మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డ్వామా ఏపీడీ పల్లాబత్తుల వసంతమాధవి, డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, ఎంపీడీవో హిమమహేశ్వరి, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు 94శాతం పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తొలిరోజు మంగళవారం 94శాతం పూర్తి చేశారు. మొత్తం 271039మందికిగాను 2,54642మందికి పంపిణీచేశారు. రూ.116కోట్ల88లక్షలకుగాను రూ.109కోట్ల34లక్షలు పంపిణీ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు పంపిణీ సాగినట్లు అధికారులు వెల్లడించారు.



పరీక్షలు రాసి బయటకు వస్తున్న టెన్త్ విద్యార్థులు



ముగిసిన టెన్త్ పరీక్షలు

- సాంఘిక శాస్త్రం పరీక్షకు 27,407మంది హాజరు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ముగిశాయి. గతనెల 17న ప్రారంభమైన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు జిల్లాలో 27,749మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,407మంది విద్యార్థుల హాజరుకాగా 342మంది గైర్హాజరైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. పరీక్షల తనిఖీ అధికారులు 43, డీఈవో 3 పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రెవెన్యూ, పోలీస్, ట్రెజరీ, రవాణా, పోస్టల్, మెడికల్, జెడ్పీ, ఆర్టీసీ, ట్రాన్స్‌కోశాఖల అధికారులు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు.

● **పరీక్షా పత్రాల మూల్యాంకనం**

పదోతరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనాన్ని గురువారం నుంచి కాకినాడ సాలిపేట బాలికల ఉన్నతపాఠశాలలో ప్రారంభించనున్నామని డీఈవో రమేష్ తెలిపారు. మూల్యాంకనప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ ప్రక్రియ ఈనెల 9వరకూ కొనసాగుతుందని చెప్పారు.

కేంద్ర హోంమంత్రితో ఎంపీ సతీష్‌బాబు కీలక భేటీ



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయిన రాజ్యసభ ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో మంగళవారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కీలక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై ఆయనతో చర్చించారు. వాటికి ఆయన సానుకూలంగా స్పందించారని ఎంపీ సతీష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా రాజ్యసభలో తెలుగుదేశం పాత్ర గురించి కూలంకషంగా చర్చించారని, రాబోయే రోజుల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై విలువైన చర్చజరిగిందని తెలియజేశారు.

కోస్టల్ షిప్పింగ్ బిల్లుతో దేశీయ నౌకారంగం అభివృద్ధి

- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

దేశీయ నౌకారంగం అభివృద్ధితోపాటు మారిటైం రంగంలో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కోస్టల్ షిప్పింగ్ బిల్లు దోహదం చేస్తుందని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న కోస్టల్ షిప్పింగ్ బిల్లు-2024పై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో 7,500 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉన్నప్పటికీ సరకు రవాణా కేవలం ఏడుశాతం మాత్రమేనన్నారు. ఈ బిల్లు ద్వారా తీర ప్రాంతంలో సరకు రవాణా సులభతరమవుతుందని, తద్వారా రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు దేశీయ నౌకారంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తుందని అన్నారు.

కోస్టల్ షిప్పింగ్ బిల్లులో తీర ప్రాంతంలో చమురు అన్వేషణ, పరిశోధనలు చేర్చడం అభినందనీయమని, తద్వారా దేశంలోని చమురు అన్వేషణలకు మరింతఊతం లభిస్తుందని అన్నారు. షిప్పింగ్ బిల్లు ద్వారా దేశంలో నౌకల నిర్మాణానికి ప్రోత్సాహం లభించి విదేశీ నౌకలపై ఆధారపడడం తగ్గించడంతోపాటు పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాలతోపాటు భారతీయ యాజమాన్యంలోని నౌకలకు లైసెన్సింగ్ అడ్డంకులు తొలగిపోతాయన్నారు. డీప్ వాటర్ పోర్టు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చెందుతున్న కాకినాడ నేడు షిప్ బిల్డింగ్, మారిటైం హబ్‌గా మారుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం కాకినాడలో నౌకల నిర్మాణ రంగం అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు పెట్టాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, కోస్టల్ బిల్లు ద్వారా తీర ప్రాంతంలో సరకు రవాణా మెరుగవ్వడంతోపాటు నౌకల నిర్మాణ రంగం అభివృద్ధి చెందుతుందని, తక్షణం కోస్టల్ షిప్పింగ్ బిల్లు-2024ను ఆమోదించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు.

ఇంటర్‌లో.. సమూల మార్పులు

- సెకండియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం
- తొలిరోజు హాజరు అంతంత మాత్రమే
- 7 నుంచి ఫస్టియర్‌లోకి ప్రవేశాలు
- హాల్‌టికెట్ ఆధారంగా అడ్మిషన్లు
- సిలబస్ మార్పు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఇంటర్ విద్యలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువచ్చింది. తరగతుల నిర్వహణ, అడ్మిషన్ల ప్రక్రియలో నూతన విధానాన్ని అమలు చేయనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు నూతన సిలబస్‌ను అమల్లోకి తీసుకురానున్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారికి హాల్‌టిక్కెట్ల ఆధారంగా అడ్మిషన్లు కల్పించనున్నారు. నూతన విధానంలోభాగంగా మంగళవారం నుంచే ఇంటర్‌సెకండియర్ తరగతులు ప్రారంభమయ్యాయి. కాకినాడ జిల్లాలో ప్రభుత్వ అధీనంలో 44 జూనియర్ కళాశాలలున్నాయి.



గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ తరగతులు

ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14ఉండగా, అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలు(ప్లస్) 15, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 8, కేజీబీవీ 4, ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 3 ఉన్నాయి. వీటిల్లో 21వేలమంది ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి ద్వితీయ సంవత్సరంలోకి వచ్చారు.

ఇప్పుడు ఇలా...

గతంలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసిన విద్యార్థులకు వేసవి సెలవులు అనంతరమే సెకండియర్ తరగతులను ప్రారంభించేవారు. ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా మార్చివేశారు. జూన్‌లో ప్రారంభమయ్యే ఇంటర్ విద్యాసంవత్సరాన్ని ఇకనుంచి ఏప్రిల్ 1 నుంచే ప్రారంభించేలా అకడమిక్ క్యాలండర్ రూపొందించి అమల్లోకి తెచ్చారు.తొలిరోజు జిల్లాలోని 44ప్రభుత్వ అధీనంలోని కళాశాలల్లో హాజరు అంతంతమాత్రంగానే ఉన్నా బుధవారంనుంచి హాజరుశాతం పెంచేందుకు లెక్చరర్లు ప్రయత్నిస్తున్నారు. సిలబస్ ప్రారంభించనున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ విద్యార్థిమిత్ర కిట్లు కింద పుస్తకాలు, ఇతర సామాగ్రి అందజేయనున్నారు. ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ఇచ్చి జూన్ 2న మళ్లీ తరగతులు ప్రారంభిస్తారు.

ప్రైవేటుకు దీటుగా అడ్మిషన్ల ప్రక్రియ

ఇంటర్‌లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రైవేటుకు దీటుగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదోతరగతి పరీక్షలు పూర్తి కావడంతోనే ప్రైవేటు కళాశాలలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ఇదే విధానాన్ని ప్రభుత్వ అధీనంలోని కళాశాలల్లో పాటించాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించి అన్ని కళాశాలలకు ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల హాల్‌టిక్కెట్టు ఆధారంగా ప్రభుత్వ కళాశాలలు, ప్లస్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. అడ్మిషన్ల పక్రియను 7 నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకుగాను టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని లెక్చరర్లు ప్రచారం నిర్వహించనున్నారు.

సిలబస్‌లో మార్పులు


ఇంటర్ విద్యా విధానంలో సమూల మార్పులు తెస్తున్న ప్రభుత్వం సిలబస్‌ను మార్చాలని నిర్ణయించింది. తొలుత ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన నూతన పుస్తకాలు త్వరలోనే కళాశాలలుకు చేరనున్నాయి. ఈ సిలబస్‌వల్ల ఎంబైపీసీ కోర్సు నూతనంగా అందుబాటులోకి రానుంది. ఇదే సమయంలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించే 7 నుంచే బ్రిడ్జి కోర్సు నిర్వహించనున్నారు.

అకడమిక్ క్యాలెండర్ ఇలా

ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరాన్ని ప్రారంభించిన నేపథ్యంలో అకడమిక్ క్యాలెండర్‌ను ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఏప్రిల్ 23 వరకూ ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించి 24 నుంచి జూన్ 1 వరకూ వేసవి సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 2న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. జూలై 17నుంచి 19 వరకూ యూనిట్ 1 పరీక్షలు, ఆగస్టు 18 నుంచి 20 వరకూ యూనిట్-2 పరీక్షలు, సెప్టెంబరు 15నుంచి 20 వరకూ క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5 వరకు దసరా సెలవులు ఉండనున్నాయి. అక్టోబరు 22 నుంచి 24 వరకూ యూనిట్-3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకూ హాఫ్ ఇయర్లీ పరీక్షలు, డిసెంబరు 15 నుంచి 20వరకూ ప్రీఫైనల్-1 పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 10నుంచి 18 వరకూ సంక్రాంతి సెలవులు ఇస్తారు. జనవరి 21నుంచి 28 వరకూ ప్రీఫైనల్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఇదే నెలలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి మొదటి లేదా రెండోవారంలోనే పరీక్షలు పూర్తి చేస్తారు. ఇంటర్ విద్యా సంవత్సరానికి 2026, మార్చి 18న ఆఖరి పనిదినంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇంటర్ విద్యాసంవత్సరంలో మార్పులకు అనుగుణంగా గతంలో 215గా ఉన్న పనిదినాలు 235రోజులకు పెరగనున్నాయి.


శిక్షణ పొందుతున్న బాలుడు

> ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి... తర్వాత మగధీరలో రామ్‌చరణ్..... బాహుబలిలో ప్రభాస్... వారిలా గుర్రపుస్వారీ చేయాలనే ఆసక్తి యువతలో పెరుగుతోంది. హార్స్ రైడింగ్ ప్రస్తుతం ట్రెండ్‌గా మారింది. యువతతో పాటు చిన్న పిల్లలు కూడా నేర్చుకునేందుకు శ్రద్ధ కనబరుస్తున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు హార్స్ రైడింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. వారు గుర్రాలపై స్వారీ చేస్తుంటే చూసి ముచ్చట పడుతున్నారు. యువత, చిన్నారుల తల్లిదండ్రులకు అనుగుణంగా హార్స్ రైడింగ్ ట్రైనింగ్ సెంటర్లు వెలుస్తున్నాయి.


గుర్రపు స్వారీ చేస్తున్న యువకుడు

రి హార్స్ ల్స్

- గుర్రపు స్వారీపై ఆసక్తి కనబరుస్తున్న జనం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెరుగుతున్న శిక్షణ కేంద్రాలు
- కాకినాడ బీచ్‌లో దౌడు తీస్తున్న యువకులు, చిన్నారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు వందకు పైగా గుర్రాలను పెంచుతున్నారంటే గుర్రపు స్వారీ పట్ల యువత ఆసక్తి ఎంతో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాలు వెలిశాయి. గతంలో గుర్రపు స్వారీ నేర్చుకోవాలంటే పెద్ద పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఓ మోస్తరు పట్టణాల్లో సైతం శిక్షణ కేంద్రాలు తెరుస్తున్నారు. వేసవి కావడంతో యువతతో పాటు చిన్నారులు కూడా గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేకాదు కార్పొరేట్ స్థాయి ప్రైవేటు స్కూళ్లల్లో సైతం గుర్రపు స్వారీ శిక్షణ ఇప్పిస్తుండడం విశేషం..

ఎన్నో ప్రయోజనాలు...

గుర్రపు స్వారీ నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక సమస్యల నుంచి గట్టెక్కవచ్చు. పోలియో, పక్షవాతంతో పాటు, మెదడు, వెన్నెముక సమస్యలు, వినికిడి లోపాలు... ఇలా అనేక సమస్యలకు చక్కటి చికిత్సగా పని చేస్తుంది. ముఖ్యంగా మానసిక వికాసం లోపించిన పిల్లలకు మంచి ఫలితాలు ఇస్తుందని నిపుణులు చెప్తున్నారు. పిల్లలు గుర్రపు స్వారీ చేయడం వల్ల ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. గుర్రం కళ్లెం పట్టుకోవడం, నిటారుగా కూర్చోవడం, గుర్రాన్ని దుమికించడం, ఒకే రీతిలో ముందుకు సాగడం వంటి చర్యల వల్ల మెదడుకు, శరీరానికి మధ్య సమన్వయం ఏర్పడి మానసిక ఉత్తేజం కలుగుతుంది. ఫలితంగా అనేక రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయని చెప్తున్నారు.

ఇసుక నేలైతేనే మేలు...

గుర్రపు స్వారీ ఓ సాహస క్రీడ. ప్రమాదాలకు ఎక్కువ అవకాశాలున్నాయి. అందుకే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గట్టినేలపై ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉండడంతో.. శిక్షకులు ఇసుక నేలల్లో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలు అనుకూలంగా ఉండడంతో ఇక్కడే చాలా మంది తమ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులోని ఇసుక మేటల మధ్య కొందరు యువకులు గుర్రపు స్వారీ శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున నేర్పుతున్నారు. అయితే మూడు నెలల పాటు శిక్షణకు వస్తే.. గుర్రపు స్వారీపై కాస్త పట్టు సాధించవచ్చని చెప్తున్నారు.


స్వారీకి గుర్రాన్ని సిద్ధం చేస్తున్న శిక్షకులు






ఖరీదైన అశ్వంతో అనిల్ రెడ్డి

అశ్వమిత్ర... అనిల్ రెడ్డి



కాకినాడ విద్యుత్ నగర్‌కు చెందిన అనిల్ రెడ్డి జంతు ప్రేమికుడు. పలు జాతుల కుక్కలు, గుర్రాలను పెంచి పోషిస్తుంటారు. హార్స్ రైడింగ్‌లో కూడా ఈయన నేర్పరి. ఈయన సుమారు పది వరకు మార్వాడీ జాతి గుర్రాలను పెంచుతున్నారు. అందులో ఏడింటిని వ్యక్తిగత అభిరుచి మేరకు పెంచుకుంటుండగా, మూడింటిని శిక్షణకు వినియోగిస్తున్నారు. ఆయన వద్ద రూ.లక్షన్నర మొదలు రూ.కోటి వరకు విలువైన గుర్రాలు వున్నాయి. వీటిని రాజస్థాన్, పంజాబ్ నుంచి తీసుకొచ్చారు. రెండేళ్లుగా ఇక్కడ శిక్షకులను, గుర్రాల సంరక్షకులను ఉంచి, గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈయన పెంచుతున్న గుర్రాలు రెండుసార్లు ఆల్ ఇండియా చాంపియన్‌షిప్ సాధించాయి.





నేటి సమాజంలో అనేక మంది పిల్లలు ఆటిజం సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశం లో ప్రతి 68 మంది పిల్లల్లో ఒక్కరు ఆటిజంతో బాధపడుతున్నారని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెంట్ ఆటిజం (సీడీసీ) నివేదికలు చెప్తున్నాయి. ఆటిజంపై అవగాహన లేని తల్లిదండ్రులు కొందరు ఉండగా, పిల్లలకు దానిని పెద్ద జబ్బుగా భావించే తల్లిదండ్రులు మరికొందరు ఉన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం జరుపుకుంటున్నారు.

ఆటిజం... అధిగమిద్దాం



- ఈ లక్షణాలున్న పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి
- నేడు ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా...

రాయవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుంది. పిల్లల మానసిక ఎదుగుదల సరిగ్గా జరగక సాధారణ జీవితం గడపడం కష్టమవుతుంది. మహిళలు గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్ర ఉద్వేగాలకు లోనుకావడంతో పాటు ఇన్ఫెక్షన్లకు గురవుతారు. మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు అందులో స్రవించే సెరటోనిక్, డోపమిన్ వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోవడం, నెలలు నిండకుండా శిశువు పుడితే కూడా ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవడం, తల్లిదండ్రులు పిల్లలతో గడపకపోవడం కూడా ఆటిజం సమస్యకు కారణం కావచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.



లక్షణాలు: సాధారణంగా శిశువులు ఏడాది వయసులో పాకడం, నవ్వడం, నడవడం, ముద్దుముద్దుగా మాట్లాడడం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పిలుపునకు బదుల్వివడం వంటివి చేస్తుంటారు. ఆటిజం సమస్య వున్న పిల్లల్లో ఈ లక్షణాలు కనిపించవు. వయసుకు తగ్గట్టుగా మానసిక పరిపక్వత లేకపోవడం, ఎవరితోనూ కలవకుండా ఒంటరిగా ఉండడం, నేరుగా కళ్లల్లోకి చూడలేకపోవడం, మాట్లాడలేక పోవడం, ఇతరులతో కలవడానికి ఇష్టపడకపోవడం, చేసిన పనులనే మళ్లీమళ్లీ చేస్తుండడం, ఎలాంటి అనుభూతి తెలపకపోవడం, శరీరంపై గాయాలైనా తెలుసుకోలేకపోవడం, శబ్ధాలను పట్టించుకోకపోవడం, సరిగా మాట్లాడలేకపోవడం (లేదా) కారణం లేకుండా ఏడవడం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పిలిచినా పట్టించుకోకపోవడం వంటి లక్షణాలను కలిగి ఉంటారు.

అధిగమించే మార్గాలు: పిల్లల్లో ఆటిజం సమస్యను అధిగమించేందుకు తల్లిదండ్రులు అనేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కడుపులో బిడ్డ ఎదుగుదలను వైద్యుల ద్వారా తెలుసుకోవడం, గర్భధారణ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, వ్యాయామాలు చేయడం, మనోల్లాసంగా ఉండడంతో పాటు తల్లులు నిర్దిష్టమైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటూ వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవడం వల్ల ఆటిజం ప్రమాదాన్ని నివారించవచ్చు. గర్భిణులు కొన్ని రకాలైన రోగాలను నియంత్రించేందుకు టీకాలు సైతం తీసుకోవాలి. శిశువు కదలికలకు సంబంధించిన ఏమైనా అనుమానిత లక్షణాలు గమనిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం ఉత్తమం. ఒకవేళ ఆటిజం బయటపడితే వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకుంటూ మరిన్ని జాగ్రత్తలు పాటించి పిల్లలను కాపాడుకోవచ్చు.

తొందరగా గుర్తిస్తేనే నివారణ సాధ్యం



చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదల లోపంతో ఆటిజం వస్తుంది. వీరిలో చాలా మందికి తెలివితేటలు పూర్తిగా లేకపోవడం, పరస్పర సంభాషణలు సరిగ్గా లేకపోవడం, చెప్పాలనుకున్నది సరిగ్గా చెప్పకపోవడం, భావాలను వ్యక్తం చేయలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తాత, అమ్మ, నాన్న వంటి పదాలను పలికిన కొన్ని రోజులకు పలకడం మానేయడం, వాళ్లలో వాళ్లు ఆడుకోవడం, పిలిచినా పట్టించుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే అనుమానించి డాక్టర్‌ను సంప్రదించాలి. పిల్లలు చేసిన పనులు మళ్లీ మళ్లీ చేయడం, ఒకే రకమైన వస్తువులు కావాలని కోరుకోవడం, అధిక కోపం, పిల్లలు వారిని వారు కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే వైద్యుల ను సంప్రదించాలి. చాలా మందిలో అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) ఆటిజం కి తేడా తెలుసుకోలేరు. ఏడీహెచ్‌డీ, ఆటిజం ఒకటి కాదు అని తల్లిదండ్రులు గుర్తించాలి. ఏడీహెచ్‌డీకి మందులు ఉన్నా ఆటిజంకు లేవు. ఆరు, ఏడు సంవత్సరాలు వచ్చే వరకు పట్టించుకోకుండా వదిలేస్తే పిల్లల్లో ఆటిజం నివారణ సాధ్యం కాదు. ఎంత తొందరగా గుర్తించి సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకువెళ్లి థెరపీ ఇప్పిస్తే అంత మంచిది.

డాక్టర్ వానపల్లి వరప్రసాద్, సైకియాట్రిస్టు, కాకినాడ

అట్టహాసంగా ముగిసిన నాటిక పోటీలు

- మూడోరోజు మూడు నాటికల ప్రదర్శన

రావులపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 25వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. మూడోరోజు నాటిక పోటీలను శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, పలివెల త్రిమూర్తులు, హాస్యనటుడు గౌతమ్‌రాజులు ప్రారంభించారు. మూడో రోజు సహృదయ ద్రాణాదుల బాపట్ల వారి వర్క్‌ఫం హోం ఈనాటికకు దర్శకత్వం డి.మహేంద్ర, నాటకీరణ అద్దెపల్లి భరత్‌కుమార్, రెండో నాటికగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు ఈ నాటికకు దర్శకత్వం గోకరాజు విజయ్, రచన పీటీ మాధవ్ వ్యవహరించారు. ప్రత్యేక ప్రదర్శనగా సీఆర్సీ రావులపాలెం వారి అలా ఎలా నాటికను ప్రదర్శించా రు. ఈ నాటికకు కథ రచన డా.విక్టరీ వెంకటరెడ్డి, దర్శకత్వం నాటకీకరణ గంటా రామమోహనరావులు వ్యవహరించారు. రావులపాలెం సీఆర్సీ కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన నాటికపోటీలు ప్రేక్షకులను ఆద్యంతం ఆలోచింప చేశాయి. నాటకరంగ కళాకారుల హావభావాలు పాత్రలకు అనుగుణంగా జీవించి నటించడంతో ప్రేక్షకులు నాటిక ప్రారంభ సమయంనుంచి ముగిసేవరకు ఆశక్తిగాతిలకించారు.

వర్క్‌ఫ్రమ్ హోం నాటిక ...

వర్క్ ఫ్రమ్ హోం ప్రవేశపెట్టిన తరువాత వంటరాని మొగుడుతో భార్య అన్ని పనులు చేయిస్తుంది. భర్త ఎదురు తిరిగిన సమయంలో నేను నా పుట్టింటికి వెళ్లిపోతానని బెదిరించి కాలక్షేపం చేస్తుంది. వంటరాని భర్తలను ఇబ్బందులు పె ట్టడం ఫేస్‌బుక్ స్నేహాలవల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ఈనాటిక సాగింది.

జనరల్ బోగీ నాటిక సారాంశం

ఓడలలోను, విమానాలలోను ప్రయాణం చేయని వారు ఉండవచ్చు ఏమోకానీ రైలులో ప్రయాణం చేయనివారు ఉండరు. సామాన్యుడు జనరల్ బోగిలలో మాత్రమే ప్రయాణించడానికి ఇష్టపడతారు. రైల్వేశాఖ వారు ఈమధ్య జనరల్ బోగీలను తగ్గించారు. జనంతో కిక్కిరిసి ఉంటున్నాయి. కిక్కిరిసిన జనంతో జనరల్ బోగీలలో ప్రయాణించే సమయంలో ఆ రైలుకు ఏదైన ప్రమాదం జరిగితే మరణించిన వారి వివరాలు రైల్వేశాఖవద్ద ఉండవు. జనరల్ బోగీ పెంచడం తోపాటు జనరల్ టిక్కెట్ తీసుకునే ప్రయాణికుల వివరాలు కూడా రైల్వేశాఖ నమో దు చేయాలనే సందేశాత్మకంగా ఈనాటిక సాగింది.





రావులపాలెం సీఆర్సీలో వర్క్‌ఫ్రమ్ హోం నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు, మూడోరోజు నాటిక పోటీలు ప్రారంభిస్తున్న సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం

కిక్ బాక్సింగ్‌లో 'నన్నయ'కు కాంస్య పతకం


కాంస్య పతక విజేతను అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ కిక్ బాక్సింగ్ పురుషుల చాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల విద్యార్థి బెజవాడ మోహన్‌రాజ్ కాంస్య పతకం సాధించాడని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలో జరిగిన ఉగాది పురస్కారాలలో మోహన్‌రాజ్‌కు పతకాన్ని ప్రదానంచేసి సన్మానించి అభినందించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆమె తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ పురుషుల చాంపియన్‌షిప్‌లో నన్నయ అనుబంధ కళాశాల అయిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మోహన్‌రాజ్ 75 కిలోల కేటగిరీలో కాంస్య పతకం సాధించాడని చెప్పారు. విద్యార్థులందరూ క్రీడలలో రాణించాలని కళాశాలలు, విశ్వవిద్యాలయం అందుకు తగిన ప్రోత్సాహం అందించాలని వీసీ సూచించారు. విద్యార్థి మోహన్‌రాజ్‌ను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, నన్నయ అధికారులు అభినందించారు.

సత్యదేవుడి సన్నిధిలో దస్త్రాలకు పూజ


అనివేటి మండపంలో దస్త్రాలకు పూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 2025-26ఆర్థిక సంవత్సరానికిగాను దేవస్థానంలో నిర్వహించే ఆర్థికలావాదేవీలు, ఇన్వెంటరీ దస్త్రాలకు సంబంధించి పుస్తకాలకు మంగళవారం అనివేటి మండపంలో పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లను ఆసీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం చిట్టా పుస్తకాలను స్వామివారి పాదాలచెంత ఉంచారు. చతుర్వేద పండితులు వేదస్వస్తిఅందజేశారు. ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

గిరిజనుల చేపల పండగ

ఎటపాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గిరిజనులు చేపల వేటను పండగలా నిర్వహిస్తుంటారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట చెరువులో మంగళవారం గిరిజనులు ఉల్లాసంగా ఉత్సాహంగా చేపల వేటను సాగించారు. వేసవిలో తమ గ్రామాల పరిధిలో చెరువుల్లో ప్రతీఏటా గిరిజనులు చేపలవేట సాగిస్తుండడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో చెరువులో చేపల వేట కోసం చుట్టుపక్కల గ్రామాలైన కృష్ణవరం, నల్లకుంట, ఎర్రబోరు, గొందిరాజుపేట, చింతలచెరువు, పండువారిగూడెం, కొత్తూరు, పట్టుచీర, కన్నాపురం, తెలంగాణలోని పలు గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు చేపల వేటను జోరుగా నిర్వహించారు. సంప్రదాయ వలలతో కుటుంబ సభ్యులంతా మూకుమ్మడిగా వేటలో పాల్గొనడం విశేషం. వేటలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చేపలను పట్టుకుని తీసుకెళ్లారు.


చెరువులో చేపల వేట నిర్వహిస్తున్న గిరిజనులు

రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు శివారున ఉన్న తిరుమల విద్యా సంస్థల్లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్ అండ్ ఎన్ఈఈటీలపై అవగాహన సదస్సు ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. తమ పిల్లలు భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే ఎలా సంసిద్ధులు కావాలో ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. వివరాలకు 7997071672, 7702449686లను సంప్రదించాలని తెలిపారు.

పనస చెట్టు మొదల్లోనే కాయల గుత్తులు

పి.గన్నవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పనసకు సాధారణంగా కొమ్మలతోపాటు కొంత ఎత్తులో చెట్టుకు కాయలు ఉంటాయి. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం శివారు డీఎస్ పాలెంలో పనసచెట్టు మొదల్లో కాయలు గుత్తులుగా కాశాయి. ఆ పనసచెట్టు మొదల్లో 12 కాయలు కాసి చూపరులను అబ్బురపరుస్తోంది.


పనసచెట్టు కింది భాగంలో కాసిన కాయలు

» బాలికల పాఠశాలల్లో మహిళా బోధకులే ఉండాలన్న నిబంధనకు ఐటీడీఏల తూట్లు
» అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నా దాచిపెడుతున్న వైనం
» అడ్డతీగలలో బాలికల విద్యాలయంలోనే బస చేస్తున్న పురుష సంక్షేమాధికారి
» గిరిజన విద్యాలయాల్లో బాలికలకు సంరక్షణ కరువు

భద్రత ఏది?



(రంపచోడవరం/అడ్డతీగల-ఆంధ్రజ్యోతి)

గిరిజన విద్యాలయాల్లో బాలికలకు భద్రత కరువైంది. బాలికల పాఠశాలల్లో కచ్చితంగా మహిళా బోధకులు, మహిళా సిబ్బంది మాత్రమే ఉండాలన్న నిబంధనలకు భిన్నంగా రంపచోడవరం మన్యంలోని రెండు ఐటీడీఏల పరిధిలో పురుష బోధకులను కొనసాగిస్తుండటంతో గిరిజన బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. తరచుగా గిరిజన బాలికలపై లైంగిక వేధింపులు చోటుచేసుకున్న విద్యాలయాలన్నీ పురుష ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులూ ఉన్నవే. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో 35 గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో కేవలం 7 పాఠశాలలు మాత్రమే పూర్తిగా మహిళా ప్రధానోపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులతో నడుస్తున్నాయి. పురుష ప్రధానోపాధ్యాయులు, పురుష ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లోనే బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఉన్నతాధికారులు ఈ లోపాలను సరిదిద్దేందుకు, వాటిని పునరావృతం కాకుండా చూసేందుకు ఎటువంటి చర్యలను చేపట్టడం లేదు. తాజాగా అడ్డతీగల మండలంలో ఓ పాఠశాలలో ఓ ఘటనపై వదంతులు వచ్చాయి. అందుకు సంబంధించి వైద్య పరీక్షలు కూడా జరిగాయి. ఇదిలా ఉండగా ఆ విద్యాలయంలోనే ఓ గిరిజన సంక్షేమ పురుష అధికారి బస చేస్తుండటం కూడా వివాదంగా మారింది. బాలికల విద్యాలయంలోనే నిబంధనలకు విరుద్ధంగా బస చేస్తుండటాన్ని ఎవరూ అడ్డుచెప్పడంలేదు. ఇకనైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపడితేనే గిరిజన సంక్షేమానికి సార్థకత.

అమ్మో ఆరుగురా!

ఇదేంటో తెలుసా? టూ వీలర్. ఈ బండిపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలనేది ఒక నిబంధన. సాధారణంగా ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం చూస్తుంటాం. అయితే అదీ కూడా తప్పే. మరీ రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ రోడ్‌లో ఈ టూ వీలర్‌పై చూశారా... పరిమితికి మించి ఏకంగా ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ఏ వాహనమైనా అడ్డొచ్చిందంటే అంతే పరిస్థితి. ప్రమాదాలు చెప్పి రావండోయ్. నిబంధనలు పాటించాల్సిందే. జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

ఫొటోగ్రాఫర్ – రాజమహేంద్రవరం



అన్నప్రసాదం స్వీకరించి ఇంటికి వెళ్తుండగా..

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

గోపాలపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలోని వాదాలకుంట పంచాయతీ పరిధిలో వెదుళ్లకుంట యాద వోలు మధ్యలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగుడెం మండలం అంకాలగుడెం గ్రామానికి చెందిన బోడా పవన్‌కుమార్ (20) వెదుళ్ల కుంట గ్రామ శివారులో ఉన్న శ్రీ రేగులమ్మ ఆలయం వద్ద జరిగే అన్నప్రసాద కార్యక్రమానికి హాజరై ప్రసాదాన్ని స్వీకరించిన తరువాత తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వెదుల్లకుంట, యాదవోలు గ్రామాల మధ్య ఈ ప్రమాదం జరిగింది. పవన్‌కుమార్ తల, ఛాతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో గోపాలపురం సామాజిక కేంద్రానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్ట్

మారేడుమిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలవరం గ్రామంలో ఆర్థిక లావాదేవీల ఘర్షణలో తమ్ముడిని విల్లంబులతో హత్య చేసిన అన్నను అరెస్ట్ చేసినట్టు మారేడుమిల్లి సీఐ సీహెచ్‌గోపాలకృష్ణ తెలిపారు. గత నెల 23న తమ్ముడి సుగిరెడ్డిని అన్న లచ్చిరెడ్డి రూ.20వేలు అప్పు బాకీ తీర్చలేదనే విషయంలో గొడవ పడి బాణాలతో కొట్టి చంపాడు. ఘటన తరువాత పరారీలో ఉన్నాడగా మంగళవారం నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో బెదిరింపులు

పోక్సో కేసు నమోదు

ఆత్రేయపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతుంది. ఆమె తల్లి బతుకుతెరువు కోసం గల్ఫ్‌లో ఉండగా తండ్రి కూడా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదే గ్రామానికి చెందిన గూడపాటి సంపత్ కూమార్ ప్రేమ పేరుతో బాలిక వెంటపడి తనను ప్రేమించకుంటే హని చేస్తానని ఏడాది కాలంగా బెదిరిస్తున్నాడు. బాలిక బంధువుల సాయంతో మంగళవారం ఆత్రేయపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాము తెలిపారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించడంపై ఫిర్యాదు

సీతానగరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రఘుదేవపురానికి చెందిన తన్నీరు జయమ్మ కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఇల్లు నిర్మాణం కొనసాగిస్తున్నందున స్థానిక ఎస్ఐ డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి జి.జయభార్గవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రఘుదేవపురం చెరువు గట్టును ఆక్రమించి పాకల్లో నివాసముండేవారని వాటి స్థానంలో జయమ్మ ఇల్లు నిర్మింస్తుండడంతో పక్కనే ఉన్నవారు కోర్టును ఆశ్రయించగా పనులు నిలిపివేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. కానీ పనులు కొనసాగించడంతో పంచాయతీ నోటీసులు ఇచ్చినా తీసుకోవడంలేదన్నారు. దీంతో ఫిర్యాదు చేశామన్నారు.

'పది' పరీక్షలు పూర్తి...

స్నేహితులతో స్నానానికి వెళ్లి...

కాలువలో మునిగి విద్యార్థి మృతి

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో యువనగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి(16) మంగళవారం రామచంద్రపురం మండలం వెల్ల వద్ద కాలువలో మునిగి చనిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పిల్లా వారి పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మంగళవారం పది పరీక్షలు పూర్తికావడంతో స్నేహితులతో కలసి వెల్ల వద్ద కాలువలో స్నానానికి వెళ్లారు. ఇద్దరు మాత్రమే కాలువలోకి దిగారు. ఒకరు కాలువలో మునిగిపోయాడు. మిగిలినవారు ఇంటికి సమాచారం ఇవ్వడంతో కటుంబ సభ్యులు కాలువ వద్దకు చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని బయటకుతీశారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు, సమాచారం లేదని ద్రాక్షారామ పోలీసులు తెలిపారు.

ఆ స్థలం మాది.. కాదు మాది!

» ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణ స్థలంపై అన్నవరం దేవస్థానం, ఇరిగేషన్ శాఖ మధ్య వివాదం
» పదిరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆర్డీవో ఆదేశం



రెండుశాఖల మధ్య వివాదాస్పద స్థల సమస్యపై సర్వేలో పాల్గొన్న ఆర్డీవో, ఇతర అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క అన్నవరం దేవస్థానం, మరోపక్క ఇరిగేషన్ శాఖ ఆ స్థలం మాదంటే మాది అని రెండు దశాబ్దాలుగా పోరాటం చేయడం మధ్యలో సర్వే చేపట్టడం తదుపరి సర్వే రిపోర్టు రాకుండానే ఇరు శాఖల అధికారులు మిన్నకుండిపోవడం రివాజుగా మారిపోయింది. వివారాల్లోకి వెళితే అన్నవరం పంపా రిజర్వాయిర్‌ను ఆనుకుని ఒక ప్రయివేట్ రిసార్ట్ నిర్మించారు. ఈ నిర్మాణం దేవస్థానం ఆధీనంలో ఉందని అన్నవరం దేవస్థానం అధికారులు, లేదు ఇరిగేషన్ పరిధిలో ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. దీనిపై మంగళవారం పెద్దాపురం ఆర్డీవో కె రమణి, ల్యాండ్ సర్వే రికార్డు ఏడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తహశీల్దార్ తాతారావు, దేవస్థానం అధికారులతో సర్వే చేపట్టారు. వివాదం పూర్వాపరాలు తెలుసుకున్న అనంతరం పదిరోజుల్లో ఆరెంపూడి అన్నవరం, బెండపూడి వరకు సరిహద్దులు నిర్ణయించి నివేదికను ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు. ఇప్పటివరకు సత్యగిరి నుంచి ప్రారంభమైన సర్వే వివాదాస్పద స్థలం వద్దకు వచ్చేసరికి చల్లబడిపోయేవారు. అయితే తాజాగా వివాదాస్పద స్థలం ఉన్న సర్వే నంబరు 15 నుంచి 24 వరకు సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించడంతో ఈ సమస్య కొలిక్కివస్తుందా లేకుంటే షరామామూలేనా అని దేవస్థానం ఉద్యోగులు, గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. సర్వేలో ల్యాండ్ ప్రొటెక్షన్ అధికారులతో పాటు దేవస్థానం సహాయ కమిషనర్ రామ్మోహనరావు, సూపరెంటెండెంట్‌లు వీవీరమణ, బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు పాల్గొన్నారు.

మాటామాటా కలిపి.. శారీరక వాంఛ ఎర వేసి..

మద్యంలో మత్తుబిల్లులు.. గడ్డిమందు కలిపి తాగించి సహకార ఉద్యోగిని నిలువు దోపిడీ చేసి పరారైన మహిళ
మహిళతో పాటు సహకరించిన ఇద్దరి అరెస్టు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ రాత్రి వేళ పానీపూరీ బండి వద్ద 60ఏళ్ల సహకార ఉద్యోగితో ఓ మహిళ మాటామాటా కలిపింది. సెక్సువల్‌గా ప్రేరేపించింది. ఓ ఇంటికి తీసుకువచ్చి ఇద్దరు అనుచరులతో మద్యంలో మత్తుబిల్లలు, గడ్డి మందు కలిపి సదరు ఉద్యోగితో తాగించారు. ఆ వ్యక్తి అపస్మారక స్థితికి వెళ్లగానే నిలువు దోపిడీ చేసి పరారయ్యారు. కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో సదరు ఉద్యోగి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. ఈ కేసు వివరాలను అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు మంగళవారం రాత్రి విలేకర్లకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో అద్దెకు ఉంటున్న ఒక వ్యక్తి అల్లవరం మండలంలో ఒక పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్నాడు. గత నెల 17వ తేదీన సొసైటీ నుంచి రూ.లక్ష నగదు తీసుకుని అమలాపురం వచ్చాడు. ఆ రోజు రాత్రి 8.30 గంటల సమయంలో మద్యం సేవించి స్థానిక పానీపూరీ బండి వద్దకు వచ్చాడు. అక్కడే పానీపూరీ తింటున్న కాకినాడ మండలం తూరంగికి చెందిన కుమారి (30) పరిచయమైంది. మాటామాటా కలిపింది. అక్కడి నుంచి వారిద్దరు మోటారుసైకిల్‌పై బండారులంక వైపు వెళ్లారు. వారి ఏకాంతానికి సరైన ప్రదేశం లభించలేదు. దాంతో ఆ మహిళ అమలాపురంలో తనకు తెలుసున్న స్నేహితుని ఇల్లు ఉందని చెప్పి నమ్మించింది. ఇద్దరూ కలిసి అమలాపురం నారాయణపేటకు చేరుకున్నారు. ఇందుపల్లి గ్రామానికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యం ఆ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అప్పటికే వారి పథకం ప్రకారం బండారులంక ఎగ్జిబిషన్ వీధికి టి.వెంకటరమణను అక్కడకు రప్పించారు. మద్యం మత్తులో ఉన్న సొసైటీ ఉద్యోగిని జాగ్రత్తగా ఇంట్లోకి తీసుకువెళ్లారు. మద్యంలో తొలుత మత్తు బిల్లలు కలిపి ఇచ్చారు. అప్పటికీ ఉద్యోగి అలాగే ఉండడంతో వెంకటరమణ పథకం ప్రకారం గడ్డి మందును సిద్ధం చేసి ఉంచాడు. తొలుత కూల్‌డ్రింక్‌లో కొద్దిగా గడ్డిమందు కలిపి సహకార ఉద్యోగితో తాగించారు. ఈ తరువాత మద్యంలో గడ్డి మందు కలిపి తాగించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే వారు ఉద్యోగి జేబులో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు అతడి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని అపహరించుకుని పరారయ్యారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉద్యోగికి మెలకువ రాగా మోసపోయానని గుర్తించి ఎక్కడ పరువు పోతుందోనని ఎవరికీ ఏమీ చెప్పకుండా ఇంటికి చేరుకున్నాడు. గడ్డి మందు తాగించడంతో అనారోగ్యం పాలవ్వగా ఇంటి వద్దే ఉండి వైద్యం చేయించుకుంటున్నాడు. అంతకంతకు బాధ ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు గత నెల 26న నిలదీశారు. అప్పుడు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని అదేరోజున ఫిర్యాదు చేశారు. సీఐ వీరబాబు ఆధ్వర్యంలో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో తూరంగికి చెందిన కుమారితో పాటు ఆమెకు సహకరించిన సుబ్రహ్మణ్యం, వెంకటరమణను మంగళవారం అరెస్టు చేసి వారి నుంచి బంగారు ఉంగరం, రూ.45వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్నామన్నారు. ఇదిలాఉండగా తీవ్ర అనారోగ్యానికి గురైన సహకార ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో వైద్యసేవలు పొందుతున్నాడు.

ఆసుపత్రి నుంచి పసికందు అపహరణ

పసిబిడ్డతో బస్సులో వెళ్లిపోతున్న మహిళను చింతూరులో పట్టుకున్న పోలీసులు

సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత



పసికందుతో వెళ్తున్న మహిళను పట్టుకున్న పోలీసులు

రంపచోడవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి 5 రోజుల పసికందును గుర్తు తెలియని ఓ మహిళా అపహరించుకుని వెళ్లిపోగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. వై.రామవరం మండలం గుర్తేడు సమీపంలోని దుంపవలసకు చెందిన అందాల కళావతి 5రోజుల క్రితం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మగ బిడ్డకు ప్రసవించింది. మంగళవారం ఓ మహిళ నర్సుగా చెప్పుకుని తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఆ బిడ్డ తక్కువ బరువుతో జన్మించిందని, అత్యవసరంగా బాక్స్‌లో పెట్టాలని కామెర్లు వచ్చాయని వారిని నమ్మించి తీసుకెళ్లింది. కొంతసేపటికి తల్లిదండ్రులు పసిపిల్లల వార్డుకు వెళ్లి చూసుకోగా తమ బిడ్డ అక్కడలేదని గుర్తించారు. వెంటనే ఆసుపత్రి అధికారుల ద్వారా పోలీసు, ఐటీడీఏ, రెవెన్యూ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం రంపచోడవరం డీఎస్పీ ప్రశాంత్ కుమార్ డివిజన్ మొత్తాన్ని అప్రమత్తం చేశారు. ఎక్కడిక్కడ వాహన తనిఖీలు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రంపచోడవరం ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి ఓ మహిళ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రాజోలు నుంచి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కిందని సమాచారం తెలియడంతో డీఎస్పీ చింతూరు సబ్ డివిజన్ పోలీసులను అప్రమత్తం చేశారు. బస్సు చింతూరు చేరుకోగానే పోలీసులు చుట్టుముట్టి పసిబిడ్డతో ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆరా తీయగా ఆ మహిళే పసిబిడ్డను అపహరించిందని గుర్తించారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ఆ పసిబిడ్డను వైద్యులతో పరీక్షించి మహిళను రంపచోడవరం తరలించారు. ఆ పసికందును తల్లి దండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనతో ఆసుపత్రిలో నిర్వహణలోపం,భద్రత తేటతెల్లమైంది.

కేసు నమోదు చేశాం : డీఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి పసికందును అపహరించిన కేసులో కత్తి అశ్విని అనే మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నామని డీఎస్పీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పసికందును తల్లిదండ్రులకు అప్పగించి మీడియాతో మాట్లాడారు. నిందితురాలిని పట్టుకోవడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీఐలు ఆర్‌జె.రవికుమార్, సీహెచ్ గోపాలకృష్ణ, టి.దుర్గాప్రసాద్, ఎస్ఐలు డి.భూషణం, బి.వినోద్, పి.రమేష్, ట్రైనీ ఎస్ఐలు ఎస్.గిరిధర్‌బాబు, వి.సుజాత, సురేష్ పాల్గొన్నారు.

విషమంగానే నాగాంజలి పరిస్థితి

ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడి

న్యాయం చేయాలని తల్లిదండ్రుల డిమాండ్



రాజమహేంద్రవరంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రభుత్వ వైద్యుల బృందం

రాజమహేంద్రవరం అర్బన్/సిటి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంనకు చెందిన ఎస్.నాగాంజలి(ఫార్మసిస్ట్) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో మంగళవారం బోధనాసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అనస్థీషియా ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ అనిల్‌కుమార్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ నీలిమ విలేకర్లతో మాట్లాడారు. నాగాంజలికి రోజు రోజుకు ఇన్‌ఫెక్షన్ పెరుగుతున్నదన్నారు. గత నెల 28వ తేదీ నుంచి ఆమె ఆరోగ్యంపై ఫాలో అవుతున్నామన్నారు. బ్రెయిన్‌కు ఆక్సిజన్ తగ్గిపోవడం వల్ల డ్యామేజీ ఎక్కువగా జరిగిందని భావిస్తున్నామన్నారు. పేషెంట్‌ను ప్రస్తుత పరిస్థితుల్లో వేరేచోటకు షిఫ్ట్ చేసే అవకాశం లేదని, ఆరోగ్య పరిస్థితి అంత క్రిటికల్‌గా ఉందన్నారు. బీపీ డౌన్ అవుతోందని, ఫీవర్ పెరుగుతున్నదన్నారు. జాండీస్ కూడా వచ్చిందన్నారు. బొల్లినేని ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పూర్తిస్థాయిలో జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇలా ఎన్నిరోజులు కండీషన్ ఉంటుందనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా వైసీపీ నాయకులు మాజీ ఎంపీ భరత్‌రామ్, యాంకర్ శ్యామల, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆసుపత్రి ఐసీయూలో ఉన్న నాగాంజలిని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం డీఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. ఇదే ఆసుపత్రిలో అంజలి ఇంజక్షన్ చేసుకుందని కానీ ఆ దృశ్యాలు రికార్డయిన సీసీ ఫుటేజీని మాత్రం ఇప్పటి వరకు బాధిత తల్లిదండ్రులకు ఇవ్వలేదన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాగాంజలి తల్లిదండ్రులు మాట్లాడుతూ మా బిడ్డను మాతో ఆరోగ్యంగా పంపాలన్నారు. గత పది రోజులుగా ఎటువంటి మార్పులేదని మా లాంటి పరిస్థితి ఎవ్వరికి రాకుడదన్నారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.వసుంధర, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.సుధాకర్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక నాగాంజలిని పరిశీలించారు.

4న అమరావతి చిత్ర కళా వీధి ప్రదర్శన

రాజమహేంద్రవరంలో నిర్వహణ : కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, కమిషనర్



సెంట్రల్ జైలు రోడ్డులో చేస్తున్న ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఈనెల 4న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు రోడ్డులో ఆర్ట్స్ కాలేజి నుంచి జీజీహెచ్ వరకూ నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆమె మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఎం.మల్లిఖార్జునరావుతో కలసి చిత్రకళా వీధి ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కళాకారుల ప్రతిభకు తగిన గుర్తింపు తీసుకురావడం కోసం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సుమారు 500 మందికి పైగా కళాకారులు వస్తున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని వీధి ప్రదర్శన ద్వారా వచ్చే నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రదర్శనలో భాగ స్వామ్యం కోరుకునేవారు అమరావతి ఆర్ట్ ఫెస్టివల్.కామ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల రోడ్డులో అమరావతి వీధి ప్రదర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పింఛన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారీ

పిఠాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ సొమ్ముతో వార్డు సచివాలయ ఉద్యోగి పరారీ అయ్యాడు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుతో పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పురపాలక సంఘం ఆరవ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న యర్రా వెంకటరమణ 12,13 వార్డులకు పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు రూ.1.50లక్షలకు వెంకటరమణకు ఇవ్వగా మరో రూ.32 వేలు వార్డు సచివాలయం అడ్మిన్ వద్ద ఉంచారు. ఉదయమే లబ్ధిదారులకు పింఛన్‌ను ఇవ్వాల్సిన వెంకటరమణ ఇవ్వలేదు. పింఛన్ సొమ్ము రూ.1.50లక్షలతో పరారీ అయినట్లు గుర్తించి మున్సిపల్ కమిషనరు కనకారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 4 నెలల క్రితం ఇదే ఉద్యోగి లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని ఫించన్ సొమ్ము ఇవ్వకుండా వెళ్లిపోగా, ఉన్నతాధికారుల హెచ్చరికలతో తిరిగి వచ్చి సొమ్ములు అందజేశాడు. ఇప్పుడు విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు కమిషనరు ధ్రువీకరించారు.

'కోర్ట్' నటుడికి ఘన స్వాగతం

స్వగ్రామం వచ్చిన రోషన్



కూనవరంలో ర్యాలీగా వస్తున్న రోషన్



కూనవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలై విశేష ఆదరణ పొందిన కోర్ట్ సినిమాలో కీలకపాత్రలో నటించిన రోషన్ స్వగ్రామమైన కూనవరంలో మంగళవారం అడుగుపెట్టడంతో అతని అభిమానులు అడుగడుగున నీరాజనంతో ఘనస్వాగతం పలికారు. రోషన్ పుట్టిన ఊరు కూనవరం. దీంతో రోషన్ సలార్, విరూపాక్ష తదితర సినిమాల్లో నటించాడు. ఇటీవల అగ్రహీరో మెగాస్టార్ చిరంజీవి కోర్ట్ సినిమా బృందాన్ని తన ఇంటికి పిలిపించుకుని అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే. మండలంలో రోషన్ పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ తన స్వగ్రామమైన కూనవరంలో ఇంతటి అభిమానం చూపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అభిమానుల ఆసక్తి మేరకు మరిన్ని చిత్రాల్లో నటించి కూనవరానికి, తన కుటుంబానికి, అభిమానులకు మంచి పేరు తీసుకువస్తానని పేర్కొన్నాడు.

కాంతి కిరణం!

ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. సూర్య కిరణాల ధాటికి ప్రజలు విలవిల్లాడున్నారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సూర్య కిరణం ఓ కాకి మీద పడుతున్నట్టు కనిపించిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.

ఫొటోగ్రాఫర్ - కాకినాడ



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేటి నుంచి దివ్యాంగులకు బస్ పాసుల జారీ

కరప, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి మూడు రోజుల పాటు దివ్యాంగులకు రాయితీతో కూడిన ఆర్టీసీ బస్ పాసులు జారీ చేయనున్నట్టు మార్కెటింగ్ సూపర్‌వైజర్లు ఎంఆర్ఎల్ స్వామి, బీవీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. 2న వేళంగి, పెద కొత్తూరు, 3న వాకాడ, వేములవాడ, 4న కరప గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మూడేళ్ల కాలపరిమితికి జారీ చేసే ఈ పాస్ కోసం సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, రూ.100 నగదుతో హాజరు కావాలని కోరారు.

జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



ఆధునికీకరించిన వెయిటింగ్ హాలును ప్రారంభిస్తున్న కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కస్టమ్స్ శాఖ సహకారం అందిస్తుందని కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. రోగుల సౌలభ్యం కోసం జీజీహెచ్‌లో రూ.10 లక్షల కస్టమ్స్ నిధులతో ఆధునికీకరించిన వెయిటింగ్ హాలును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో బిజీగా ఉండే తమ సిబ్బంది సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. భోజనశాల ఆధునికీకరణతో పాటు వెయిటింగ్ హాలు నిర్మాణానికి సహకారం అందించిన కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కస్టమ్స్ అదనపు కమిషనర్ వై.రామకృష్ణరాజు యాదవ్, సహాయ కమిషనర్ బి.మహేష్‌బాబు, ఏసీ ఎన్.రవికుమార్, సీపీడీ సూపరింటెండెంట్ వి.రంగారావు, ప్రివెన్టివ్ సూపరింటెండెంట్ కె.రమేష్, ఆసుపత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీ ఆర్.విఠల్, హెచ్‌వోడీ శ్రీనివాస్, పలువురు వైద్యులు, కస్టమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

మంత్రి వాసంశెట్టి సుభాష్



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కరప, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబనకు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. మహిళా స్వయం ఉపాధి పథకంలో భాగంగా కాజులూరులో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. 240 మందికి మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు ఇచ్చి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు వితంతువులకును తన పింఛన్లను మంత్రి అందజేశారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, డేగల సతీష్, మాజీ సర్పంచ్‌లు వనుం వీరబ్రహ్మం, కోట తాతబ్బాయి, పెంకే అప్పారావు, రొక్కాల సత్తిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే పంతం నానాజీ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పది నెలల్లో కాకినాడ రూరల్‌లో రూ.37 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలో ఉపాధి హామీ నిధులతో పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సతీష్, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, ఈవోపీఆర్డీ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, కూటమి నాయకులు శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, చప్పిడి వెంకటేశ్వరరావు, అబ్బు, కిషోర్, సతీష్, సీతయ్యదొర, ప్రకాష్‌గౌడ్, తాతాజీ, శ్రీరాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరప ప్రాంతీయ పశువైద్యశాల ప్రాంగణంలోను, పెనుగుదురు గ్రామంలోను పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ఎంపీడీవో మట్టపర్తి అనుపమ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, నీటి సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి గోవిందరాజులు, నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి గంగాధర్, గంటా నానిబాబు, పేకేటి ప్రసాద్, కార్యదర్శి యు.నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలపై డ్రోన్లతో నిఘా

పిఠాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతాలు, జాతీయ రహదారి వెంబడి ఖాళీ ప్రదేశాలపై డ్రోన్ల ద్వారా నిఘా ఉంచుతున్నట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. 216జాతీయ రహదారి, పిఠాపురం బైపాస్‌లోని వై.జంక్షన్, వైఎస్సార్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమానితులు, మద్యం, గంజాయి తాగే వారిని డ్రోన్ల ద్వారా గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మార్కెట్ ప్రాంతంలో రోడ్డు పైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్న దుకాణదారులను హెచ్చరించారు. ఆక్రమణలను తక్షణం తొలగించాలని సూచించారు. పట్టణ ఎస్ఐలు మణికుమార్, జానీబాషా పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాల నివారణలో భాగంగా ఎస్పీ జి.బిందు మాధవ్ కరప పోలీస్ స్టేషన్‌కు ఒక డ్రోన్ అందించినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. కరపలో మంగళవారం ఆమె డ్రోన్‌ను లాంఛనంగా ప్రారంభించి గ్రామంలో పలు ప్రాంతాలపై నిఘా పెట్టారు. కోడిపందాలు, జూదాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరించి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవాంఛనీయ ఘటనల బాధ్యులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించారు. ఏఎస్ఐ సూరిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జమునా నగర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

సామర్లకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డు నుంచి కాలువపై మాధవపట్నం జమునానగర్ కాలనీకి రూ.70లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులకు జిల్లా ఇన్‌చార్జి అధికారి వీరపాండ్యన్ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పశువులకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 350 నీటితొట్టెలు మంజూరు చేసిందన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో రెండువేల పశువుల షెడ్లు నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో హిమమహేశ్వరి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి'

గొల్లప్రోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి అధికారులను ఆదేశించారు. గొల్లప్రోలులో గతంలో అసంపూర్తిగా ఉండిపోయి ప్రస్తుతం పనులు నిర్వహించి పూర్తి చేసిన తహసీల్దారు కార్యాలయం, అర్బన్ హెల్త్ సెంటర్, అన్న క్యాంటీన్ భవనాలను మంగళవారం ఆమె పరిశీలించారు. గొల్లప్రోలు వాటర్ వర్క్సును పరిశీలించి రూ.78లక్షల వ్యయంతో చేసిన పనులపై ఆరా తీశారు. పిఠాపురంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాన్ని పరిశీలించారు. త్వరలో వీటిని ప్రారంభించనున్నందున పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. పీడీ వెంట గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ, నగర పంచాయతీ కమిషనరు కనకారావు, వివిధ శాఖల అధికారులు వున్నారు.

పాదగయ పుష్కరిణిలో కొత్త నీరు

పిఠాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో కొత్త నీరు పెట్టారు. మంగళవారం నుంచి పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులను అనుమతిస్తున్నామని ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 20 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడవ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి మంగళవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎన్.రమేష్, డి.రామారావు తమ బృందాలతో సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 20 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరు పర్చగా 10 మందికి ఒక్కొక్కరికి రెండు రోజులు చొప్పున జైలు శిక్ష, మిగతా 10 మందికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని సీఐ రమేష్ చెప్పారు.

పెన్షన్‌దారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: ఎమ్మెల్యే కొండబాబు



దుమ్ములపేటలో లబ్ధిదారురాలికి పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పెన్షన్‌దారులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెలా ఒకటో తేదీ ఉదయమే రూ.4వేలు అందిస్తున్నామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. 10వ డివిజన్ దుమ్ములపేట పెద్దమ్మవారి కాలనీ, 37వ డివిజన్ పాత బస్టాండ్ వెంకటేశ్వర కాలనీలో పెన్షన్‌దారులకు మంగళవారం ఉదయం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూగు రాజు, ఏరిపిల్లి రాము, మోసా పేతూరు, మల్లాడి గంగాధరం, కొండ్రు తాతారావు, ఎరిపిల్లి అబ్బాయి, ఎల్లయమ్మ పాల్గొన్నారు. అనంతరం దుమ్ములపేట తారకరామానగర్ పార్కు వద్ద టీడీపీ నాయకుడు చోడిపల్లి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కొండబాబు ప్రారంభించారు.

36వ డివిజన్‌కు చెందిన వృద్ధాప్య పెన్షన్‌దారుడు చల్లపల్లి త్రిమూర్తులు గుండెపోటుతో మరణించాడు. నెలలోనే ఆయన భార్య వెంకటలక్ష్మికి స్పౌజ్ పెన్షన్ మంజూరు చేశారు. టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ మంగళవారం సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారురాలికి రూ.4వేలు పెన్షన్ అందజేశారు. మహిళా నాయకురాలు నల్లూరి తులసి, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండెవరంలో సర్పంచ్ వేమగిరి చెల్లాయ్యమ్మ, ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, కొత్తపల్లిలో గవర గంగాభవానీనాగేశ్వరరావు స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. వేమగిరి రాంబాబు, చెలికాని జగదీష్, తోట ప్రసాద్, మాజీ ఎంపీటీసీ కురాకుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులే చేపలు పట్టించి విక్రయించారు

చెందుర్తి పెద చెరువు వద్ద పోలీసు బందోబస్తు



చెందుర్తి పెద చెరువు వద్ద చేపలు పట్టించి అమ్మిస్తున్న మత్స్య శాఖ అధికారులు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు బందోబస్తు మధ్య అధికారులే దగ్గరుండి చెరువులో చేపలు పట్టించి విక్రయించారు. రెవెన్యూ, మత్స్య, పంచాయతీ, పోలీసు అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ సాగగా పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి వచ్చి పర్యవేక్షించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని పెద చెరువులో చేపలు పట్టుకునే విషయంలో చెందుర్తి, కొడవలి మత్స్యకార సంఘాల మధ్య కొంతకాలంగా వివాదం ఉంది. దీనిపై కోర్టులో కేసులు ఉన్నాయి. వేసవి రావడంతో చెరువులో నీరు తగ్గిపోయింది. దీంతో చేపలు పట్టే విషయంలో రెండు సంఘాలతో చర్చలు జరిపిన అధికారులు ప్రత్యేక అధికారిని ఏర్పాటుచేసి చేపలు పట్టించి విక్రయిస్తామని ప్రకటించారు. అందుకు అనుగుణంగా మంగళవారం ఉదయం నుంచీ అధికారులు దగ్గరుండి చేపలు పట్టించి వారి పర్యవేక్షణలోనే విక్రయాలు సాగించారు. ఒక్కరోజే రెండువేల టన్నులకు పైగా చేపలు పట్టగా రూ.2లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని చెరువు సంఘానికి జమ చేయనున్నారు. చేపలు పట్టివేత, విక్రయాలను మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.కృష్ణారావు, ఏడీ కరుణాకరరావు, ఎఫ్‌డీవో రామకృష్ణ, తహసీల్దారు సత్యనారాయణ, ఈవోపీఆర్డీ కుమార్, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు దగ్గరుండి పర్యవేక్షించగా గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా మరో రెండు విడతలుగా చేపలు పట్టాల్సి ఉంటుందని మత్స్య శాఖ అధికారులు చెప్పారు.



ఎంపీపీ అనంతలక్ష్మిని అభినందిస్తున్న బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ వెంకటేశ్వరరావు

ఎంపీపీని కలిసిన బీజేపీ నాయకులు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం పండూరులో కాకినాడ రూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. నాయకులు బావిశెట్టి వీరబాబు, పి.లీలావతి, ఎ.వెంకటేష్, రామకృష్ణ, పి.ముత్యాలరావు, వి.సూరన్న, పి.శివ, కె.వెంకట్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



రవాణాకు సిద్ధం చేసిన పచ్చి మామిడికాయలు

కొండెవరం నుంచి కోల్‌కత్తాకు...

పచ్చిమామిడి

కొత్తపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొండెవరం నుంచి కోల్‌కత్తాకు పచ్చిమామిడి కాయుల రవాణా జరుగుతోంది. కొండెవరం పరిసర ప్రాంతాలకు చెందిన రైతుల తోటల్లో కలెక్టర్ రకం మామిడి చెట్లకు చెందిన పచ్చి మామిడి కాయలను కిలోల చొప్పున అమ్మకానికి సిద్ధం చేశారు. కిలో పచ్చిమామిడి కాయలను రూ.14 నుంచి రూ.19 చొప్పున కొండెవరంలో రెండు, మూడు సెంటర్ల ద్వారా కమీషన్‌దారులు కొనుగోలు చేస్తున్నారు. వాటిని లారీల్లో కోల్‌కత్తా, ఒడిసా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ మామిడిని హోటళ్లలో పచ్చళ్ల తయారీకి వినియోగిస్తారు.



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు, స్వయంవరపార్వతి అమ్మవారు

వసంత నవరాత్ర పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా కుమారరామ భీమేశ్వరాలయంలో బాలా త్రిపురసుందరి అమ్మవారికి ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న విశేష పూజలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. కంచి మహా సంస్థానంలో వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి-పద్మ ఆధ్వర్యంలో స్వయంవర పార్వతి అమ్మవారికి విశేష అభిషేకాలు, పుష్పార్చన జరిపారు.

రేపు కాకినాడలో జిల్లా ఆర్యవైశ్య మహా సభ



ఆర్య వైశ్య మహా సభ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ప్రతినిధులు

పిఠాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొలి సమావేశం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కాకినాడలో గురువారం జరుగుతుందని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఆహ్వాన పత్రికలను వాసవి అమ్మవారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. జిల్లాల విభజన తర్వాత కాకినాడ జిల్లాకు తొలిసారి నూతన కమిటీ ఏర్పాటైందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దంగేటి సత్యనారాయణ (సత్తిపండు), కంచర్ల నగేష్, ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, తాతాజీ, వెలగా వెంకటనగేష్, బోడా సతీష్, రేపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ సర్వే నెం.1లో ఉన్న 456 ఎకరాల ప్రభుత్వ భూమిలో 40 సంవత్సరాలుగా సాగు చేస్తున్న ఎస్సీ, బీసీ కులాల వారికి పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ గొల్లప్రోలు మండల శాఖ, వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని సాగుదారులకు పట్టాలివ్వాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గొడుగు సత్యనారాయణ, పిల్లా చంద్రం, కె.కుమారి, కోనాటి రమణ, తంగెళ్ల రాంబాబు, పీఎస్ రాజు, నక్కా అప్పన్న, సాగుదారులు పాల్గొన్నారు.

'పద్మశాలీలు ఐక్యత చాటాలి'



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘ నాయకుడు

పెద్దాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలంటే ఐక్యత చాటాలని పద్మశాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పెద్దాపురం పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా కట్టా రాజబాబు, ఉపాధ్యక్షుడిగా కొల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా బెందులూరి స్వామి, సహాయ కార్యదర్శిగా కొండేటి వీరభద్రరావు, కోశాధికారులుగా మొండి శ్రీనివాసరావు, సోమశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పప్పు దుర్గారమేష్, జగ్గారపు మల్లికార్జున, కొండేటి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గానికి దిశానిర్దేశం చేశారు.

మున్సిపల్ వర్కర్స్‌ని పర్మినెంట్ చేయాలని ధర్నా

పెద్దాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తూ మార్చి 6న కేబినెట్ ఆమోదం తెలిపినట్టు ముఖ్యమంత్రి ప్రకటన చేయడం దారుణమని సీఐటీయూ నాయకుడు సిరిపురపు శ్రీనివాస్ అన్నారు. ఆప్కాస్ రద్దుకు నిరసనగా ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆప్కాస్‌ను రద్దు చేసే ఆలోచన ఉంటే మున్సిపల్ శానిటేషన్ ఇంజనీరింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. శివకోట అప్పారావు, గిరిబాబు, సింగంపల్లి సింహాచలం, వర్రి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో జిల్లా ఇన్‌చార్జి అధికారి తనిఖీలు

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి)

నగరంలోని ప్రకాశం స్ట్రీట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) మంగళవారం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్, జిల్లా ఇన్‌చార్జి అధికారి అయిన జి.వీరపాండ్యన్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. యూపీహెచ్‌సీలోని రిజిస్టర్లను తనిఖీ చేసి ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ వివరాలు, వార్డులు, ఫార్మసీలోని మందుల వివరాలు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటింటా సర్వే వివరాలపై ఆరా తీశారు. వేసవి దృష్ట్యా వడగాల్పుల వల్ల, నీరు కలుషితం వల్ల సంభవించే అనారోగ్యాల పట్ల వైద్యాధికారులు దృష్టి సారించాలని వీర పాండ్యన్ సూచించారు. అదే విధంగా క్యాన్సర్, మధుమేహ వ్యాధులకు సంబంధించి ఇంటింటా చేస్తున్న ఎన్‌సీడీ-3.0 సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. అవసరతను బట్టి ఏరియా లేదా జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేయాలని ఆదేశించారు. వీరపాండ్యన్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ ప్రభాకర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

4,5 తేదీల్లో నాగబాబు పర్యటన

పిఠాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఈ నెల 4,5 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో ఆయన పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

చలి వేంద్రాలు ప్రారంభం

సామర్లకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కూడళ్లలో చలివేంద్రాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య మంగళవారం ప్రారంభించారు. లయన్స్ భీమేశ్వర క్లబ్ ప్రతినిధి ఈదర ఈశ్వరకుమార్, సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం, మరిడమ్మ గుడి వద్ద చలివేంద్రాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, మున్సిపల్ కమిషనరు కేవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ గ్రంథాలయానికి బెంచీల వితరణ

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ కాకినాడ స్మార్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని లయన్స్ క్లబ్ హాల్లో నిర్వహించిన సమావేశంలో వాకర్స్ సంఘానికి బెంచీలు, టీపాయిలు వితరణ చేశారు. వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బోట్ క్లబ్ పార్కు ఆవరణలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి కొప్పర్తి సాయికృష్ణ సౌజన్యంతో బెంచీలు అందజేసినట్టు లయన్ వీఎస్ఆర్ మూర్తి తెలిపారు. వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, క్లబ్ సభ్యులు ఓం నమశ్శివాయ, ఐ.ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

సామర్లకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిసాయి. సోషల్ పరీక్షకు రెగ్యులర్ 1,501 విద్యార్థులకు 1,491 మంది, కంపార్ట్‌మెంటల్ 36 విద్యార్థులకు 29 మంది హాజరయ్యారని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని డీఈవో పిల్లి రమేష్ సందర్శించి ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల (ప్లస్‌టూ)లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభించినట్టు లెక్చరర్ హనుమంతరావు, హెచ్ఎం యు.మీనామాధురి తెలిపారు. తొలిరోజైన మంగళవారం ముగ్గురు అడ్మిషన్లు పొందిట్టు వారు చెప్పారు.


పెద్దాపురం సీఐగా విజయశంకర్

బాధ్యతల స్వీకారం



పెద్దాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.విజయ శంకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐగా ఉన్న ఆయన ఇక్కడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీఐగా కొనసాగిన క్రాంతికుమార్‌ను బదిలీ చేయడంతో ఆయన స్థానంలో ఇప్పటి వరకు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయశంకర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. పెద్దాపురం నియోజకవర్గంపై అవగాహన ఉందని, ప్రజలకు మెరుగైన సేవలం దిస్తానన్నారు.

గొల్లప్రోలు ఏపీవోగా గంగాభవానీ



గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గొల్లప్రోలు మండల ఏపీవోగా ఆర్.గంగాభవాని మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గండేపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఏపీవోగా పనిచేసిన కొండలరావు కొత్తపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

BHIMAVARAM MUNICIPALITY

EXPRESSION OF INTEREST (E.O.I)

Roc No.2193/EOI/2025/G1/DB Dated :01.04.2025

The Commissioner, Bhimavaram Municipality invites the Expression of Interest (E.O.I) for providing "**PROPOSAL FOR INSTALLATION, UPGRADATION, OPREATION & MAINTENANCE OF MODREN TRAFFIC SIGNALS ON BOOT (BUILD OWN OPERATE AND TRANSFER) BASIS IN BHIMAVARAM MUNICIPALITY LIMTS**" from the eligible Firms/Agencies/Dealing with Traffic Signals

1. Starting Date for selling E.O.I Document : 03.04.2025 at 11:00 AM
2. Ending date for Selling of E.O.I Doc : 16.04.2025 at 04:00 PM
3. Last Date for Submission of E.O.I In Sealed cover : 17.04.2025 upto 04:30 PM

The Technical bid & Finacial bid sealed in separate covers shall be dropped in the E.O.I Box at Commissioner Chamber on 17-04-2025 **up to 04.30 pm and same will be opened at 5.00 p.m.** For obtain E.O.I Document please contact Section Office during the working hours on payment of non - refundable fee of Rs.11,800/- (10,000/- + 1,800 GST) Demand Draft favouring to the commissioner, Bhimavaram Municipality. The bidder Shall submit Bid Security Deposit of Rs.1,00,000/- (Rupees One Lakh Only) by way of Demant Draft drawn from any Nationalized / Scheduled Bank of India in favor of "Commissioner, **BHIMAVARAM MUNICIPALITY**" payable at Bhimavaram along with **E.O.I**

Commissioner,
Bhimavaram Municipality.

శంఖవరం ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

శంఖవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవోగా ఎస్ఎంకేజీ ప్రసాద్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే ఎస్ఎస్ శర్మ సామర్లకోటకు బదిలీపై వెళ్లగా, శంఖవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేసే ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

93 శాతం పింఛన్ల పంపిణీ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 వేల మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. 93 శాతం పూర్తయ్యిందన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఐటీడీఏ పీవో సింహాచలం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు అమలుచేసేందుకు ప్రతి గిరిజన రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వ్యవసాయశాఖ ప్రైమరీ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా ప్రభుత్వ పథకాలు ఎప్పటికప్పుడు ప్రతి గిరిజన రైతుకు చేరవేసే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయం అభివృద్ధి పెంచే విధంగా రైతులకు సూచనలివ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సీహెచ్‌కేవీ చౌదరి, సావిత్రి, పీఏవో ఎల్.రాంబాబు, మండల వ్యవసాయాధికారులు కె.లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, విశ్వనాథం, చక్రధర్, సువర్ణకుమారి, ఉపాధి పథకం ఏపీవోలు రెడ్డిబాబు, అరవాలు, స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయితో జీవితాలను నాశనం చేసుకోవద్దు



ఎంసీడీ గ్రామంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న చింతూరు సీఐ తెల్లం దుర్గారావు



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలో ఉన్న ఎంసీడీ గ్రామంలో గంజాయి అవగాహన సదస్సు చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు గంజాయి మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. బాగా చదువుకుని మంచి మార్గంలో ప్రయాణిస్తూ భవిష్యత్తుకు పూలబాట వేసుకోవాలన్నారు. చేతబడులపై అవగాహన కల్పించారు. పిల్లల్ని బాగా చదివించాలని సూచించారు. వ్యవసాయంలో నూతన యంత్రాలను ఉపయోగించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్స్ పంచి పెట్టారు. పెద్దలకు దుప్పట్లు, దుస్తులు, యువకులకు వాలీబాల్ కిట్లు అందించారు. గ్రామస్తులకు ఏకష్టం వచ్చినా పోలీస్ సిబ్బంది అందు బాటులో ఉంటారని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ఫిర్యాదు చేయాలన్నారు. గిరిజన పెద్దలు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ





మారేడుమిల్లి:వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎంపీడీవో, ఎటపాక: పింఛన్ అందజేస్తున్న బాచినేని శ్రీకాంత్, సంపత్



రాజవొమ్మంగి: పింఛన్ అందిస్తున్న సర్పంచ్, నాయకులు

మారేడుమిల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండలంలో 99.7శాతం విజయవంతంగా పూర్తయిందని ఎంపీ డీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని గ్రామపంచాయతీలో పరిధిలో 76క్లస్టర్లకు 1930మంది లబ్ధిదారులు ఉన్నారని, ప్రభుత్వం మార్చి నెలకు రూ.80,02,500 జమ చేయగా సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందించారన్నారు. వరుసగా ఆరు నెలల నుంచి మండలం పింఛన్ల పంపిణీలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రథమ స్థానంగా నిలుస్తుందని తెలిపారు.

ఎటపాక, (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం పేదలు, దివ్యాంగులకు ఎంతో అండగా ఉందని, పేదల బాగు కోసమే సీఎం చంద్రబాబు తపిస్తూ ఉంటారని ఐటీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బాచినేని శ్రీకాంత్, తెలుగు యువత జిల్లా నాయకుడు పాటిసంపత్ అన్నారు. మంగళవారం ఎటపాకలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ములను పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సికెల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు అందజేశారు.

రాజవొమ్మంగి, (ఆంధ్రజ్యోతి): డయాలసిస్ పేషెంట్లకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం భరోసాగా నిలుస్తుందని టీడీపీ మండల నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు అన్నారు. మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడు గ్రామంలో కోసూరి తమ్మారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతోన్నాడు. 3నెలల క్రితం పింఛన్ మంజూరైంది. అనివార్య కారణాల వల్ల పింఛన్‌దారుడు తీసుకోలేదు. మూడు నెలల పింఛన్ కలిపి రూ.30వేలు మంగళవారం తమ్మారావుకు సర్పంచ్ తొంటా ఆదిరాజు, మాజీ జడ్పీటీసీ కోసూరి బుజ్జి చిన్నాలమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొచ్చా కాసులమ్మ, కోసూరి లోవీరవెంకటరెడ్డి, కార్యదర్శి సుమర్ల రాంబాబు పాల్గొన్నారు.

రేపు వై.రామవరంలో జాబ్‌మేళా

వై.రామవరం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఉన్నతి కార్యక్రమంలో భాగంగా వై.రామవరం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తు న్నట్టు ఎంపీడీవో రవికిషోర్ తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ పాసైన వారంతా జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. అభ్యర్థుల కుటుంబం కచ్చితంగా ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. 18నుంచి 35ఏళ్లవారికి 11 రకాల ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఎంపికైన వారికి వైజాగ్‌లో శిక్షణ ఇచ్చి, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై వినతి



సబ్‌కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్నపోలవరం నిర్వాసితులు

దేవీపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల రెండు, మూడు జాబితాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణం కోసం మంగళవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీకి వినతిపత్రం అందించారు. నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం కోసం గోకవరం మండలం కృష్ణునిపాలెం వద్ద స్థలాలు కేటాయించారని, అయితే వాటిని చదునుచేసి అప్పగిస్తే ఇళ్ల నిర్మాణం చేసుకుంటామన్నారు. కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీని ప్రత్యేక పంచాయతీగా చేయాలని, శ్మశాన వాటిక కేటాయించాలని కోరారు. తొయ్యేరులో మిగిలిన వారిని గ్రామసభ పెట్టి గుర్తించాలని, కమ్యునిటీహాల్ నిర్మించాలని వివరించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

రాజవొమ్మంగి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాల్లో ఉండడం గర్వకారణమని మండల నాయకుడు గణజాల తాతారావు అన్నారు. సభ్యత్వం తీసుకున్న మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడులో రెండు బూత్‌లకు సంబంధించిన నాయకులకు సభ్యత్వ కార్డులు మంగళవారం పంపిణీ చేశారు.



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జగ్గంపేటలో సమ్మర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

జగ్గంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో చాంపియన్ సీజన్ 2 క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. మేలో సమ్మర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ (ఎస్‌పీఎల్) పోటీల పోస్టర్ ఆవిష్కరణ మంగళవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైఆర్‌కె శ్రీనివాస్, జగ్గంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ టి.రఘునాథరావు పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మే జగ్గంపేట నియోజకవర్గంలో ఉన్న క్రికెట్ క్రీడాకారులతో సమ్మర్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రీమియర్ లీగ్‌లో ఫైనల్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ. 25వేల ప్రైజ్‌మనీ, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15వేలు ప్రైజ్‌మనీ అందిస్తామన్నారు. ఆసక్తి గల క్రికెట్ క్రీడాకారులు 83319 65038 కి ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సమ్మర్ ప్రీమియర్ లీగ్ కమిటీ సభ్యులు పెండ్యాల గౌతమ్, గద్దె కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు తిలకిస్తున్న నాగేంద్ర చౌదరి, సీఐ, ఎస్ఐ

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు



ఏలేశ్వరంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పదోతరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. లింగంపర్తి జడ్పీ హైస్కూల్, ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, భాష్యం హైస్కూల్, శ్రీవిద్య స్కూల్‌ల్లో సోషల్ పరీక్షకు 932 మందికి 918 మంది విద్యార్థులు హాజరవగా 14 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో బి. అబ్బాయి తెలిపారు.

గండేపల్లి: పదిపరీక్షలు మంగళవారంతో ముగిశాయని ఎంఈవో నాయక్ తెలిపారు. గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయన్నారు. చివరిరోజు పరీక్షకు 504 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 494 మంది హాజరుకాగా, పది మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

తొండంగి: మండలంలో పదోతరగతి పరీక్షలు మంగళవారం నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షతో ముగిశాయి. తొండంగి, దానవాయిపేట, బెండపూడి, పెరుమాళ్ళపురం సెంటర్ల ద్వారా 806 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

ప్రత్తిపాడు: మండలంలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. గత నెల 31న నిర్వహించాల్సిన సాంఘికశాస్త్రం పరీక్షను మంగళవారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 854 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 840 మంది పరీక్ష రాశారని ఎంఈవో వి. రాజబాబు తెలిపారు.



గండేపల్లిలో..

వాహనాల రికార్డుల పరిశీలన

జగ్గంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్కూల్ ఆటోలు, టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యుల డ్రైవింగ్ లైసెన్సులు, వారి రికార్డులను సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునందన్‌రావు మంగళవారం పరిశీలించారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని వారికి సూచించారు. కార్యక్రమంలో టాటా మ్యాజిక్ ఓనర్లు, డ్రైవర్లు, టాటా మ్యాజిక్స్ యూనియన్ ప్రెసిడెంట్ పైలరాజు, సెక్రటరీ రమణ, జాయింట్ సెక్రటరీ దాసరి సతీష్, వైస్ ప్రెసిడెంట్ పాతంశెట్టి లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కమిటీ చైర్మన్‌గా కృష్ణారావు

కోటనందూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కోటనందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కోటనందూరుకు చెందిన వెలగా కృష్ణారావును నియమించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య ప్రకటించారు. మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, మాజీ జడ్‌పీటీసీ పెంటకోట భాస్కర సత్యనారాయణ, మాజీ ఎమ్‌పీపీ డి.చిరంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, తదితరులు అభినందించారు.

పశువుల దాహార్తికి నీటితొట్టెల నిర్మాణం

ప్రత్తిపాడు, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): పశువుల దాహార్తి నివారణకు నీటితొట్టె నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. మండలంలోని ఒమ్మంగి శ్మశానవాటిక వద్ద ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్మించే పశువుల నీటి తొట్టె నిర్మాణ పనులకు మంగళవారం ఏపీవో కుమార్ స్వామితో కలిసి ఎంపీడీవో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో నీటి తొట్టె నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.

నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పెళ్లి కానుక చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పెళ్లి జరిగిన ఒక యువతికి రూ.20 వేల పెళ్లి కానుకను టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులమీదుగా కృష్ణవరం గ్రామానికి చెందిన చెన్నంశెట్టి జయలక్ష్మికి రూ.20 వేల చెక్కును అందించారు. జాస్తి వసంత్, బొదిరెడ్ల సుబ్బారావు, గద్దె మారుతి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మన్యం వారి పాలెంనకు చెందిన వైసీపీ కార్యకర్తలు గాది శ్రీనివాసరావు, రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలతో ఆయన స్వాగతం పలికారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చలివేంద్రం



ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య

ప్రత్తిపాడు, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణుల దాహార్తి నివారణ కోసం వివేకానంద సేవా సమితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని, బొల్లు వెంకటేశ్వరరావు వారిని అభినందించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి ఫౌండేషన్ అధ్యక్షులు మైరాల నాగేశ్వరరావు, కఠారి దుర్గామల్లేశ్వర సాగర్, బొల్లు మనోజ్‌బాబు, యర్రవరం పంచాయతీ కార్యదర్శి రామరాజు వర్మ, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలకు మొబైల్ ద్వారా దరఖాస్తులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డ్వాక్రా సంఘాలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళికలకు సంబంధించి ప్రతి గ్రామంలోను గ్రామ సంఘాల నుంచి మొబైల్ అప్లికేషన్ల ద్వారా వివరాలు సేకరించడం జరుగుతుందని మండల వెలుగు ఏపీఎం వై.వెంకట్రావు చెప్పారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన డ్వాక్రా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీసీలు పి.శ్రీనివాస్, వై.శ్రీనులు, రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ

తొండంగి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మంగళవారం ప్రత్యేక కిట్లను పంపిణీ చేశారు. జిల్లా ఫైలేరియా శాఖ ద్వారా జారీ అయిన సోపు, టవలు, మగ్గు టబ్బుతో కూడిన 42 కిట్లను టీడీపీ సీనియర్ నేత యనమల నాగేశ్వరరావు , యనమల కృష్ణ చేతుల మీదుగా రోగులకు అందించారు. వైద్యాధికార్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన కిట్లను వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ సత్తిబాబు, పీహెచ్ఎన్ యేసురత్నం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



ఫైలేరియా కిట్లు అందిస్తున్న నాగేశ్వరరావు

'ప్రభుత్వ పాఠశాలు బలోపేతం చేయడం నా బాధ్యత'



పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్చాలని కోరుతున్న ఎమ్మెల్యే

జగ్గంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇర్రిపాకలో మండల ప్రజా పరిషత్‌ప్రాథమిక ఉన్నత పాఠశాలలో యుటీఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మన ఊరుబడి- మన అందరి బడి అనే పాఠశాలలో నమోదు పెంపుదల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసే బాధ్యత తనది అని తెలిపారు. ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు.

● **ఉచిత పాలిసెట్ కోచింగ్**

పదో తరగతి పరీక్షలు రాసిన వారికి జగ్గంపేట యూటీఎఫ్ హోంలో ఏప్రిల్ 3నుంచి పోలిసెట్ నిర్వహిస్తున్నట్టు దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత పాలిసెట్ కోసం 9866302442, 90595 63337, 99662 70567 సంప్రదించాలన్నారు. దీనికి సంధాన కర్తగా యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ వ్యవహరించారు. యుటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సాయిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ , తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

కిర్లంపూడి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ అకాల మృతికి సంతాపంగా కిర్లంపూడి క్రైస్తవ సంఘాల సభ్యులు శాంతి ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ డాక్టర్ ఐ సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో సభ్యులు హాజరై ప్రవీణ్ మృతికి సంతాపం తెలియజేశారు. ఏనుగువీధి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు కట్టు సూరిబాబు, మద్రా చిట్టిబాబు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ఏలేశ్వరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు నేతృత్వంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించాలన్నారు. బీజేపీ నాయకులు పైల సుభాష్ చంద్రబోస్, పైల అయ్యప్ప, నీలి సురేష్, కూరాకుల రాజా, మండలంలోని పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు వ్యతిరేకంగా సమావేశం

జగ్గంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని ఆర్అండ్‌బీ ట్రావెల్స్ బంగ్లా గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో మంగళవారం ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు దూలపల్లి వెంకటరమణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అమలును వ్యతిరేకిస్తున్న వైఎస్ జగన్‌కి వ్యతిరేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్ష హోదా వైఎస్ జగన్‌కి అసెంబ్లీలో పాలక మండలి వర్గీకరణకు ఆమోదం తెలపకుండా మాదిగలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు వల్లూరి సత్తిబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఆరుగోలు పండు, ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి చీకట్ల నాగరాజు, జగ్గంపేట మండలం ఇన్‌చార్జి పోసిపోయిన రవికుమార్, కర్రి రాజు, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



తిరుమాలిలో నీటి తొట్టెలకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ బుజ్జి, తదితరులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమాలిలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. 2025-26 సంవత్సరంలో ఎస్ఆర్ఈజీఎస్ ఉపాధి పనులు జూన్ వరకు సంబంధించి పశువులతొట్టె నిర్మాణ పనులు, చెరువులు తవ్వకం తదితర పనులకు భూమిపూజ చేశారు. మండలంలో పెద్దనాపల్లి, తిరుమాలి గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు సూతి బూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశువులకు నీటితొట్టెలు ఎంతో ఉపయోగం



నీలాద్రిరావుపేటలో పశువుల నీటితొట్టె నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

గండేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల నీటితొట్టెలు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరమని పలువురు నాయకులు, అధికారులు అన్నారు. నీలాద్రిరావుపేట గ్రామ శివారులో ఏపీవో గంగాభవానీ ఆధ్వర్యంలో పశువుల నీటి తొట్టెలు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముళ్లపాక సురేష్, టీడీపీ గ్రామాధ్యక్షుడు కురుకూరి చౌదరి, ఈసీ రమేష్, కార్యదర్శి తరంగిణి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీవో గంగాభవానీకి సత్కారం



ఏపీవో గంగాభవానీని సత్కరిస్తున్న దృశ్యం

గండేపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏపీవోగా నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న గంగాభవానీ బదిలీపై వేరే మండలానికి వెళ్లడంతో మంగళవారం నీలాద్రిరావుపేట గ్రామ పంచాయతీ ఆవరణలో కూటమి నాయకులు కె.చౌదరి, తదితరులతో పాటు పలువురు నాయకులు, సిబ్బంది సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ పనిచేయడం ఆనందంగా ఉందన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, తదితరులు

జగ్గంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్, సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేస్తున్నారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన జన సైనికుడు నాగమల్లి మణికంఠ సతీమణి వీరమణి పుట్టిన రోజు సందర్భంగా ఆర్థికసహాయం చేసినట్టు మణికంఠ తెలిపారు.దీనికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో రాజనాల శ్రీను, మాదారపు వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్ల పంపిణీ

తుని రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అధికారులు, సిబ్బంది వేకువజామునే ఆయాగ్రామాల్లో సామాజిక పెన్షన్లు పంపిణీ చేపట్టారు. తేటగుంటలో ఎంపీడీవో సాయినవీన్ పంపిణీని పరిశీలించారు. మండలం మొత్తమ్మీద 94.42 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో చెప్పారు.

BHIMAVARAM MUNICIPALITY
EXPRESSION OF INTEREST (E.O.I)
Roc No.2193/EOI/2025/G1/DB Dated :01.04.2025

The Commissioner, Bhimavaram Municipality invites the Expression of Interest (E.O.I) for providing **"PROPOSAL FOR INSTALLATION, UPGRADATION, OPREATION & MAINTENANCE OF MODREN TRAFFIC SIGNALS ON BOOT (BUILD OWN OPERATE AND TRANSFER) BASIS IN BHIMAVARAM MUNICIPALITY LIMTS"** from the eligible Firms/Agencies/Dealing with Traffic Signals

1. Starting Date for selling E.O.I Document : 03.04.2025 at 11:00 AM
2. Ending date for Selling of E.O.I Doc : 16.04.2025 at 04:00 PM
3. Last Date for Submission of E.O.I In Sealed cover : 17.04.2025 upto 04:30 PM

The Technical bid & Finacial bid sealed in separate covers shall be dropped in the E.O.I Box at Commissioner Chamber on 17-04-2025 **up to 04.30 pm and same will be opened at 5.00 p.m.** For obtain E.O.I Document please contact Section Office during the working hours on payment of non - refundable fee of Rs.11,800/- (10,000/- + 1,800 GST) Demand Draft favouring to the commissioner, Bhimavaram Municipality. The bidder Shall submit Bid Security Deposit of Rs.1,00,000/- (Rupees One Lakh Only) by way of Demant Draft drawn from any Nationalized / Scheduled Bank of India in favor of "Commissioner, **BHIMAVARAM MUNICIPALITY**" payable at Bhimavaram along with **E.O.I**

Commissioner,
Bhimavaram Municipality.